


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 4 జూన్ 2024



కృష్ణా యూనివర్సిటీలో సిద్ధమైన కౌంటింగ్ కేంద్రం (ఇన్‌సెట్‌లో) నిమ్రా కాలేజీ కౌంటింగ్ కేంద్రంలో సూచిక బోర్డులు





జడ్జిమెంట్ డే

నేడే తీర్పు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సర్వంసిద్ధం

కృష్ణాజిల్లాకు మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీలో..

ఎన్టీఆర్ జిల్లాకు ఇబ్రహీంపట్నంలోని నోవా, నిమ్రా కళాశాలల్లో..

- కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ భద్రత
- ఉదయం 8 గంటల నుంచే ప్రారంభం
- సాయంత్రం 4 గంటలకల్లా ఫలితాలు వెల్లడయ్యే అవకాశం
- తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- ఆ తర్వాత ఈవీఎంలోని కంట్రోల్ యూనిట్ల కౌంటింగ్
- అనుమతి ఉన్నవారికే కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎంట్రీ

విజయవాడ/మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు సంబంధించి రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల ఫలితాల లెక్కింపు మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అరగంట తర్వాత 8.30 గంటలకు ఈవీఎం కంట్రోల్ యూనిట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా విజయవాడ పార్లమెంట్‌కు సంబంధించి 17 మంది, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 96 మంది అభ్యర్థుల ఓట్ల లెక్కింపు చేపడతారు. కృష్ణా జిల్లావ్యాప్తంగా మచిలీపట్నం పార్లమెంట్‌కు 15 మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 79 మంది, అభ్యర్థుల ఓట్లను లెక్కిస్తారు.

ఇలా మొదలవుతుంది

మంగళవారం ఉదయం 6 గంటలకల్లా పోస్టల్ కౌంటింగ్ సిబ్బంది, 7 గంటల కల్లా ఈవీఎం కౌంటింగ్ సిబ్బంది విధులకు హాజరవుతారు. ఉదయం 6 గంటల నాటికే జనరల్ అబ్జర్వర్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లకు వేసిన సీళ్లను తొలగిస్తారు. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తారు.

ఇబ్రహీంపట్నంలోని నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కాలేజీలు, మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీల్లో పటిష్ఠ బారికేడింగ్ ఏర్పాటు చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పార్లమెంట్ లెక్కింపునకు 14 టేబుళ్లు, అసెంబ్లీల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు కలిపితే 196 టేబుళ్లపై లెక్కింపు జరుగుతుంది. ఇందులో పార్లమెంట్‌కు 98 టేబుళ్లు, అసెంబ్లీలకు 98 టేబుళ్లు ఉంటాయి. పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 3 గంటలకు, ఈవీఎంల ఓట్ల లెక్కింపు సాయంత్రం 4 గంటలకు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు.

నోవా, నిమ్రా కళాశాలల్లో ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నంలోని నోవా, నిమ్రా కళాశాలల కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. భారీ బందోబస్తు సిద్ధం చేశారు. గుర్తింపు కార్డులు కలిగిన కౌంటింగ్ సిబ్బంది, రిటర్నింగ్ అధికారులు, పోలీసులు, మీడియా ప్రతినిధులు, అభ్యర్థులు, పార్టీల ఏజెంట్లు తప్ప ఇంకెవరికీ అనుమతి లేదు. అధికారులు, కౌంటింగ్ సిబ్బంది వెళ్లడానికి వీలుగా బారికేడింగ్‌తో ఒక మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ మార్గం నుంచే వీరంతా వెళ్లాలి. మీడియా ప్రతినిధులు, కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లకు ప్రత్యేకంగా రెండో బారికేడ్ మార్గాన్ని ఏర్పాటు చేశారు.

కృష్ణా వర్సిటీలో ప్రత్యేక చర్యలు

కృష్ణా యూనివర్సిటీ వద్ద కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సోమవారం పరిశీలించారు. యూనివర్సిటీ వద్ద ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తీసుకున్న చర్యలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు, వారంతా వెళ్లే మార్గాలను పరిశీలించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను నిర్మాణంలో ఉన్న ఫార్మసీ కళాశాల భవనంలోకి మార్చాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రౌండ్లవారీగా లెక్కింపు ఫలితాలను తెలియజేసేలా మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కౌంటింగ్ సిబ్బంది బస కోసం ఏర్పాటుచేసిన రుద్రవరం గురుకుల జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహం-2ను కలెక్టర్ పరిశీలించి వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని రెండు కిలోమీటర్ల మేర ప్రాంతాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. రుద్రవరం గురుకుల పాఠశాల సమీపంలో రెండు పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేశారు.

కౌంటింగ్ వివరాలు	ఎన్టీఆర్	కృష్ణా
మొత్తం కౌంటింగ్ సిబ్బంది	1,011	1,195
మొత్తం టేబుళ్లు	196	196
పార్లమెంట్ టేబుళ్లు	98	98
ఏడు అసెంబ్లీల మొత్తం టేబుళ్లు	98	98
కౌంటింగ్ సూపర్‌వైజర్లు	301	433
కౌంటింగ్ అసిస్టెంట్లు	402	496
మైక్రో అబ్జర్వర్లు	308	248
ఏడు అసెంబ్లీల మొత్తం రౌండ్లు	132	143

ఫలితాలు ఇలా..?

మధ్యాహ్నం 3.30 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఫలితం, సాయంత్రం 4 గంటల నాటికి ఈవీఎం కౌంటింగ్ ఫలితాలు వెల్లడిస్తారు. ముందుగా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలు, సాయంత్రం 5 గంటల నాటికి విజయవాడ తూర్పు, మైలవరం నియోజకవర్గాల ఫలితాలు వెల్లడి కానున్నాయి. సాయంత్రం 6 లేదా రాత్రి 7 గంటల కల్లా డిక్లరేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

కౌంటింగ్.. ఎక్కడెక్కడ..?

- నోవా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో.. విజయవాడ వెస్ట్, సెంట్రల్, తిరువూరు, నందిగామ నియోజకవర్గాలకు సంబంధించి పార్లమెంట్, అసెంబ్లీ ఓట్ల లెక్కింపు జరుగుతుంది.
- నిమ్రా ఇంజనీరింగ్ అండ్ మెడికల్ కళాశాలలో.. విజయవాడ తూర్పు, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుంది.
- కృష్ణా యూనివర్సిటీలో.. మచిలీపట్నం పార్లమెంట్ సహా పెనమలూరు, పామర్రు, అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన, గుడివాడ, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

ఏ నియోజకవర్గం ఎన్ని రౌండ్లు..?

మచిలీపట్నం పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం 1,949 మంది సిబ్బందిని నియమించారు. 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. గన్నవరం నియోజకవర్గానికి 22 రౌండ్లలో లెక్కింపు ఉంటుంది. గుడివాడకు 17 రౌండ్లు, పెడనకు 16 రౌండ్లు, మచిలీపట్నానికి 15 రౌండ్లు, అవనిగడ్డకు 20 రౌండ్లు, పామర్రుకు 17 రౌండ్లు, పెనమలూరుకు 22 రౌండ్లలో లెక్కింపు జరుగుతుంది. ఇక మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి కేటాయించిన 14 టేబుళ్లకు నిర్దేశించిన రౌండ్ల ప్రకారం లెక్కింపు ఉంటుంది. తిరువూరు 17 రౌండ్లు, విజయవాడ పశ్చిమ 19 రౌండ్లు, సెంట్రల్ 20 రౌండ్లు, తూర్పు 22 రౌండ్లు, మైలవరం 22 రౌండ్లు, నందిగామ 16 రౌండ్లు, జగ్గయ్యపేట 16 రౌండ్లలో లెక్కింపు జరుగుతుంది. ఇక విజయవాడ పార్లమెంట్ స్థానానికి కేటాయించిన 14 టేబుళ్లకు నిర్దేశించిన రౌండ్ల ప్రకారం లెక్కింపు ఉంటుంది.



కృష్ణా వర్సిటీ కేంద్రం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

టిక్.. టిక్.. టిక్.. నరాలు తెగే ఉత్కంఠకు మరికొద్ది గంటల్లో తెరపడనుంది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల సార్వత్రిక ఎన్నికల ఫలితాల గంట నేడు మోగనుంది. ఓటర్ల నిర్ణయాత్మక తీర్పును మంగళవారం వెల్లడించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్‌ను ప్రారంభించి సాయంత్రం 4 గంటలకల్లా పూర్తిచేసేందుకు సన్నాహాలు చేశారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి ఇబ్రహీంపట్నంలోని నోవా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, నిమ్రా ఇంజనీరింగ్, నిమ్రా మెడికల్ కాలేజీల్లో, కృష్ణాజిల్లాకు సంబంధించి మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీలో కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. అటు అధికారులు కౌంటింగ్ ఏర్పాట్లలో నిమగ్నమై ఉండగా, ఇటు అభ్యర్థులు విజయావకాశాలపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తుండగా, ఓటర్ల నాడి ఎటువైపు ఉందో, ఎవరి భవితవ్యం ఏమిటో నేటి సాయంత్రానికి తేలనుంది.

పోస్టల్ బ్యాలెట్లే ఓ సవాల్..!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపే సిసలైన సవాల్‌గా మారనుంది. ఈ కౌంటింగ్‌లో పోస్టల్ బ్యాలెట్లను ప్రత్యేకంగా లెక్కించనుండటంతో కొంతమేర ఇబ్బందులు తగ్గినా లెక్కింపు విధానంలో కౌంటింగ్ సిబ్బంది చిన్న పొరపాటు చేసినా పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. అనవసర వివాదాలకు కూడా ఆస్కారమిచ్చినట్టు అవుతుంది. గతంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పెద్దగా వివాదాలు లేనప్పటికీ ఈసారి హోరాహోరీ సమరంలో ఎక్కువ సంఖ్యలో పోస్టల్ బ్యాలెట్లు ఉండటంతో ఎక్కడ ఏ చిన్న తప్పు జరిగినా సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉంటాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ప్రక్రియలో చాలా ప్రక్రియలను కౌంటింగ్ సిబ్బంది చేపట్టాల్సి ఉంటుంది. ముందుగా ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ల (వీఎఫ్‌సీ) ద్వారా వచ్చిన పోస్టల్ బ్యాలెట్లను లెక్కించాలి. ఆ తర్వాత పోస్టల్ ఓటింగ్ సెంటర్ (పీవోసీ) ద్వారా వచ్చిన ఓట్లను లెక్కించాలి. ఆ తర్వాత హోం ఓటింగ్ పోస్టల్ బ్యాలెట్లను లెక్కించాలి. చివరిగా ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపీబీఎస్) ద్వారా వచ్చిన పోస్టల్ బ్యాలెట్లను లెక్కించాలి. ఈ ప్రక్రియలన్నింటినీ ఎలాంటి పొరపాట్లు లేకుండా చేయాలి. సిబ్బందికి ఇప్పటికే రెండుసార్లు శిక్షణ ఇచ్చారు. ఫారం 13సీ, ఫారం 13ఏ (డిక్లరేషన్), ఫారం 13బీ స్థాయిలో రిజక్షన్ల డిక్లరేషన్‌లో సీరియల్ నెంబర్లు, ఓటరు సంతకం, అటెస్టెడ్ సంతకాలతో పాటు మార్కింగ్, టాబ్యులేషన్ తదితరాలకు సంబంధించిన అంశాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలిస్తేనే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు సజావుగా సాగుతుంది.

మంగినపూడి బీచ్‌లో విషాదం

- సముద్ర స్నానం చేస్తుండగా యువకుడు గల్లంతు
- మరో యువకుడిని రక్షించిన జాలర్లు, మెరైన్ పోలీసులు



ప్రాణాలతో బయటపడిన ఉమాకాంత్

మచిలీపట్నం టౌన్, జూన్ 3 : విహారయాత్ర విషాదంగా మారింది. సరదాగా సముద్ర స్నానానికని వచ్చిన స్నేహితులకు తీరని శోకాన్ని మిగిల్చింది. మచిలీపట్నం సమీపంలోని మంగినపూడి బీచ్‌లో సోమవారం జరిగిన దుర్ఘటనలో ఓ యువకుడు సముద్రంలో గల్లంతు కాగా, మరో యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు.

వివరాల్లోకి వెళితే.. ఉంగుటూరు మండలం ఇందుపల్లి గ్రామానికి చెందిన మసిముక్కు భాను (19), ఉయ్యూరుకు చెందిన మామిడిపల్లి ఉమాకాంత్‌తో పాటు ఎం.సంతోష్, మామిడిపల్లి పవన్, ఎం.జగదీష్, అంబటిపూడి సాయిహర్షిత, నందిగామకు చెందిన మాగంటి వినయ్, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన తేనెల భాస్కర్, మైనేని రాజు విజయవాడలో ఇంటర్ చదువుకుంటున్నారు. వీరంతా కలిసి సోమవారం సరదాగా మంగినపూడి సముద్రతీరానికి వచ్చారు. అందరూ కలిసి సరదాగా సముద్ర స్నానం చేస్తుండగా, అలలు ఉధృతంగా రావడంతో భాను, ఉమాకాంత్ నీటిలో కొట్టుకుపోయారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ఏఎస్‌ఐ జీవీవీఎస్ ప్రసాద్, హోమ్‌గార్డులు నాంచారయ్య, ప్రసాద్.. ఉమాకాంత్‌ను రక్షించారు. కానీ, భాను జాడ మాత్రం తెలియలేదు. సోమవారం రాత్రి వరకూ భాను కోసం వెతుకుతూనే ఉన్నారు. ఉమాకాంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లారు. రూరల్ పోలీసు స్టేషన్ ఏఎస్‌ఐ మురళీకృష్ణ ఉమాకాంత్‌ను వివరాలు అడిగి, కేసు నమోదు చేశారు.

వంతెన నిర్మించండి

బందరు కాల్వపై నిర్మాణానికి నోచుకోని వంతెన



బందరు కాల్వపై వంతెన నిర్మించాల్సిన ప్రదేశం ఇదే..

200 మీటర్ల దూరంలో ఉన్న తమ పొలాల్లోకి అడుగు పెట్టాలంటే మూడు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్నారు అక్కడి రైతులు. వ్యవసాయ కూలీలు రావాలన్నా, ఎరువుల కట్టలు తేవాలన్నా, పంటను రవాణా చేసుకోవాలన్నా ట్రాక్టర్లు, ఆటోల్లో కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని కన్నీటితో చెబుతున్న కుమ్మమూరు రైతులు.. ఇందుకు బందరు కాల్వపై వంతెన నిర్మాణమే పరిష్కారమని ప్రభుత్వాన్ని అర్థిస్తున్నారు.

- శిలాఫలకం వేసి పదేళ్లయినా పట్టించుకున్నది లేదు
- ఆశగా ఎదురుచూస్తున్న కుమ్మమూరు రైతులు
- 200 మీటర్ల దూరంలోనే వ్యవసాయ భూములు
- అయినా.. కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన దుస్థితి

తోట్లవల్లూరు : స్థానిక కుమ్మమూరు రైతులకు చెందిన పొలాలన్నీ బందరు కాల్వ, ఏనుగులకోడు డ్రెయిన్ అవతల ఉన్నాయి. కానీ, ఆ పొలాల్లోకి అడుగు పెట్టాలంటే రైతులకు నరకమే. 200 మీటర్ల దూరంలో ఉన్న పొలాలకు చేరుకోవాలంటే ఆటోల్లో అయితే పెనమకూరు మీదుగా, ద్విచక్ర వాహనమైతే మద్దులవానిగూడెం మీదుగా లేదా తోట్లవల్లూరు వంతెన మీదుగా కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఆరుగాలం కష్టించి పండించిన పంటను ఇంటికి చేర్చాలన్నా కిలోమీటర్లకొద్దీ రవాణా ఖర్చులు పెట్టుకోవాలి. బందరు కాల్వపై వంతెన లేకపోవడమే ఇందుకు కారణమని అక్కడి రైతులు చెబుతున్నారు.

శిలాఫలకంతో సరి

పన్నెండేళ్ల కిందట ఏనుగులకోడు డ్రెయిన్‌పై వంతెన నిర్మించారు. ఈ వంతెనపైకి చేరాలంటే బందరు కాల్వను దాటాలి. దీంతో బందరు కాల్వపై వంతెన నిర్మాణానికి 2014లో నాటి ఎమ్మెల్యే డీవై దాస్ శంకుస్థాపన చేశారు. కానీ, నిర్మాణం మాత్రం ముందుకు కదల్లేదు. పదేళ్లుగా శిలాఫలకానికే పరిమితమైంది. ఈ వంతెన నిర్మిస్తే 200 మీటర్ల దూరంలోని తమ పొలాలకు చేరుకోవడం చాలా తేలిక అవుతుందని కుమ్మమూరు, భద్రిరాజుపాలెం గ్రామాల రైతులు చెబుతున్నారు. కిలోమీటర్ దూరంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు సాగించవచ్చని అంటున్నారు.

రైతుల కష్టం తీర్చండి



బందరు కాల్వ, ఏనుగులకోడు డ్రెయిన్ అవతల కుమ్మమూరు రైతుల పొలాలున్నాయి. నాకు తొమ్మిది ఎకరాలు ఉంది. మా పొలాలకు చేరాలంటే ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నాం. పెనమకూరు మీదుగా రావటానికి అదనపు ఖర్చు అవుతోంది. మా రైతుల కష్టాలు తీర్చేందుకు మరుగున పడిన వంతెనను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- సూరపనేని రామారావు, రైతు, కుమ్మమూరు



దుర్గమ్మ హుండీల కానుకల లెక్కింపు

18 రోజులకు రూ.3.48 కోట్లు

వన్‌టౌన్, జూన్ 3 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం మహామండపంలో లెక్కించారు. 18 రోజుల వ్యవధికి మొత్తంగా రూ.3,48,33,515లు నగదు సమకూరింది. 535 గ్రాముల బంగారం, 7 కేజీల 540 గ్రాముల వెండి లభించింది. 601 యూఎస్‌ఏ డాలర్లు, 5 ఇంగ్లాండ్ పౌండ్లు, 100 ఓమన్ బైస్సలు, 10 కెనడా డాలర్లు, 525 అరబ్ ఎమిరేట్స్ దిర్హమ్స్, 1 కువైట్ దినార్, 132 సౌదీ రియాల్స్, 9 ఖతార్ రియాల్స్, 10 యూరోలు, 2 సింగపూర్ డాలర్లు లభించాయి. ఆన్‌లైన్-ఈ హుండీ ద్వారా రూ.1,31,114లు లభించింది. ఈవో కేఎస్ రామారావు, దేవదాయశాఖ అధికారులు, ఆలయ అధికారులు, స్పెషల్ పోలీస్, సిబ్బంది, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, భవానీ సేవాదారులు తదితరులు పాల్గొన్నారు.

అన్న వితరణకు విరాళం

దుర్గగుడిలో అన్నవితరణకు గుంటూరు అరండల్‌పేటకు చెందిన పప్పుల వెంకటేశ్వరరెడ్డి సోమవారం ఆలయానికి విచ్చేసి పప్పుల శ్రీధర్‌రెడ్డి పేరిట అన్నవితరణ నిర్వహించేందుకు రూ.1,00,116లు విరాళంగా సమర్పించారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు దాతకు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

అభయాంజనేయునికి రూ.15.67 లక్షలు..



హనుమాన్‌జంక్షన్ : స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. గడిచిన 71 రోజులకుగాను రూ.15,67,716లు ఆదాయం కానుకుల రూపంలో సమకూరినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. లెక్కింపును ఆగిరిపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు పర్యవేక్షించారు. ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



శివనాథ్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న టీడీపీ నేతలు

ద్వారకా తిరుమలేశుని సేవలో కేశినేని చిన్ని..

వన్‌టౌన్, జూన్ 3 : విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కూటమి టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆయన సతీమణి జానకీలక్ష్మి, కుమారుడు వెంకట్‌లు సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలోని వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు శివనాథ్‌కు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక టీడీపీ నాయకులు ఆయనకు ద్వారకా తిరుమలేశుని చిత్రపటాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ, మంగళవారం రాష్ట్ర ప్రజలందరూ ఎదురు చూస్తున్న నూతన ఉషోదయం జరుగుతుందని, చంద్రబాబు నాయుడు సీఎం కావాలని ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని స్వామివారిని వేడుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరి క్షేమం కోరుతూ స్వామివారిని వేడుకున్నట్టు తెలిపారు. అనంతరం గోశాలలో గోపూజ చేశారు.



భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న మాదిగాని గురునాథం, లోకేశ్‌తో యార్లగడ్డ

ఎన్నికల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ నారా లోకేశ్

- **ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం**

విద్యాధరపురం, జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా యువగళ ఉద్యమనేత నారా లోకేశ్ నిలిచారని టీడీపీ రాష్ట్ర నాయకుడు, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం సోమవారం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరితో అన్నారు. గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న భువనేశ్వరికి ఆయన పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పక్కనే ఉన్న లోకేశ్ స్పందిస్తూ విజయవాడ పార్లమెంట్ నుంచి పోటీ చేసిన కేశినేని శివనాథ్‌కు ఎంత మెజారిటీ వస్తుందని ప్రశ్నించగా లక్ష ఓట్లమెజారిటీ దాటుతుందని గురునాథం పేర్కొన్నారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలోని కూటమి అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నారని తెలిపారు. మంగళగిరిలో నారా లోకేశ్ రాష్ట్రంలోనే భారీ మెజారిటీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ మొత్తంలో నారా లోకేశ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారని ప్రశంసించారు. పరిశపోగు రాజేశ్, నరసింహచౌదరి, సంకే విశ్వనాథ్, హబీద్ హుస్సేన్, సతీశ్‌తో పాటు దళిత సంఘ నేతలు పలువురు భువనేశ్వరికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

లోకేశ్‌కు యార్లగడ్డ ఘన స్వాగతం..

గన్నవరం : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి నారా లోకేశ్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరీ, బ్రాహ్మణి తదితరులు సోమవారం ఉదయం 11.10కి గన్నవరం విచ్చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో లోకేశ్ నాయకత్వం వర్థిల్లాలంటూ నినాదాలు చేశారు. పూలబొకేలు అందజేసి, దుశ్శాలువాలు కప్పారు. టీడీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, పెద్దకూరపాడు అభ్యర్థి భాష్యం ప్రవీణ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, జాస్తి వెంకటేశ్వరరావు, మూల్పూరి సాయి కళ్యాణి, వెలగపూడి శంకర్ బాబు, శ్రీరామ్ చినబాబు, మండవ అన్వేష్, షేక్ అబుల్యాజ్, మారుపూడి ధనకోటేశ్వరరావు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

11 నుంచి కాశీ-అయోధ్య రైలు యాత్ర

ధర్నాచౌక్, జూన్ 3 : భారత్ గౌరవ్ సౌత్ స్టార్ రైల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కాశీ-అయోధ్య రైలు యాత్ర చేపడుతున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ విఘ్నేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి జూలై 3వ తేదీ వరకు 13 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. వారణాసి, గయా, ప్రయాగరాజ్, హరిద్వార్, మధుర, అయోధ్య, అమృత్‌సర్, ఢిల్లీ, ఆగ్రాలను ఈ యాత్రలో సందర్శించవచ్చన్నారు. భోజనం, బస, బస్సు, టూర్ మేనేజ్‌మెంట్, సెక్యూరిటీ వసతులతో కూడిన ప్యాకేజీ ఏసీ థర్డ్‌క్లాస్ కంఫర్ట్ రూ.37,300, స్లీపర్‌క్లాస్ రూ.25,200లకు నిర్ణయించబడిందన్నారు. మరిన్ని వివరాలు, బుకింగ్ కోసం 93550 21516, 93848 03557 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.



పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు



కౌంటింగ్ కేంద్రాల్లో మోహరించిన సాయుధ బలగాలు



సెల్‌ఫోన్లు భద్రపరిచే కౌంటర్లు



కౌంటింగ్ కేంద్రాల వద్ద ఇనుప కంచెతో పోలీసుల పహారా

నిఘా నీడలో నిమ్రా

- **కొద్ది గంటల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం**
- **కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు**
- **అభ్యర్థుల గెలుపోటములపై సర్వత్రా ఉత్కంఠ**

కొద్ది గంటల్లో.. సార్వత్రిక ఎన్నికల టెన్షన్‌కు తెరపడనుంది. అభ్యర్థుల భవితవ్యం తేల్చేందుకు ఐదేళ్లు ఓపిక పట్టిన ఓటరు.. ఓటు ఆయుధంతో నేతల జాతకం తిరగరాసే రోజు వచ్చేసింది. పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలో ఉన్న నిమ్రా ఇంజనీరింగ్ కళాశాల, నోవా ఇంజనీరింగ్ కళాశాలల్లో ఓట్ల లెక్కింపు జరగనున్నది. గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్న పార్టీల అభ్యర్థులు చివరి క్షణం వరకు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఫలితాల అనంతరం ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర ప్రత్యేక బలగాలతో కౌంటింగ్ కేంద్రాల చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లా సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. (విజయవాడ-ఆంధ్రజ్యోతి)



కౌంటింగ్ కేంద్రంలో మీడియా సెంటర్



కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బ్యారికేడ్లు





విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- **పోలీస్ అధికారులతో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి**



పోలీస్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

మచిలీపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కౌంటింగ్ రోజున జిల్లావ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. కృష్ణాయూనివర్సిటీలో సోమవారం పోలీస్ అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీకి రెండు కిలోమీటర్లదూరంలో ప్రజలు గుమికూడకుండా, సభలు, సమావేశాలు నిర్వహించకుండా నిఘా ఉంచాలన్నారు. యూనివర్సిటీ పరిసరాల్లో, జిల్లాలోని పలు ప్రాంతాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా జిల్లా పోలీస్ కార్యాలయం కంట్రోల్ రూమ్ నుంచి నిఘా ఉంచినట్టు తెలిపారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే పై అధికారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. నేరప్రవృత్తి కలిగినవారు ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దాలన్నారు. అల్లర్లకు పాల్పడేవారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కృష్ణా యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రాలలోకి అధికారులు ధృవీకరించిన పాస్‌లు ఉన్న వారినే అనుమతించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి వచ్చేవారిని క్షుణ్ణంగా తనిఖీచేయాలని, పదునైన ఆయుధాలు, ప్రమాదకర వస్తువులు కలిగి ఉంటే వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాల్లోకి వచ్చే సమయంలో వారి వద్ద సెల్‌ఫోన్‌లను కౌంటింగ్ కేంద్రాల్లోకి తీసుకువెళ్లకముందే డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్‌ఫోర్స్ గస్తీ తిరుగుతుందని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా భారీమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని, అందరు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

జగ్గయ్యపేటలో భారీ వర్షం

జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు, జూన్ 3 : జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కుండపోతగా వర్షం పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జనజీవనం స్తంభించగా పట్టణంలో పలుచోట్ల చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాను సోమవారం ఉదయం ట్రాన్స్‌కో అధికారులు పునరుద్ధరించారు.



నెర్రలు కొట్టిన పొలాలు

ఆదివారం పెనుగంచిప్రోలు మండలంలో కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి 10గంటల తర్వాత ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. సోమవారం ఉదయం వరకు కురిసింది. ఇటీవలే మెట్ట పొలాలు రైతులు దుక్కులు దున్ని సిద్ధం చేశారు. రాత్రి కురిసిన వర్షంతో పత్తి వేయటానికి సిద్ధం చేస్తున్నట్టు పలువురు రైతులు పేర్కొన్నారు. చాలారోజుల తర్వాత మంచి వర్షం పడటంతో రైతులతోపాటు ప్రజలూ ఊరట చెందారు. తీవ్రమైన వేడి వడగాడ్పులకు అల్లాడిన ప్రజలు వర్షంతో చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజుల్లో జీలుగ, పిల్లిపెసర విత్తనాలను రైతులకు సగం ధరపై పంపిణీ చేయనున్నట్టు ఏవో రామసుబ్బారెడ్డి తెలిపారు.



చంద్రబాబును కలిసిన ఎన్నికల పర్యటనల సమన్వయ బృందం

ఎన్నికల పర్యటన కో-ఆర్డినేషన్ బృందానికి చంద్రబాబు అభినందన

వన్‌టౌన్, జూన్ 3 : ఎన్నికల పర్యటనల్లో తనకు ఎంతగానో సహకరించిన సమన్వయ బృందాన్ని సోమవారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అభినందించారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో చంద్రబాబును సోమవారం సమన్వయ బృందం సభ్యులు పెందుర్తి వెంకటేష్, పరుచూరి కృష్ణ, బండారు హనుమంతరావు, గంటా గౌతమ్, రవి యాదవ్, రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు కలిసారు. సమన్వయ బృందం రోజుకు మూడు నుంచి ఐదు కార్యక్రమాలలో చంద్రబాబు పాల్గొనేలా చక్కటి ప్రణాళికను రూపొందించి విజయవంతం చేయడంపై వారిని చంద్రబాబు అభినందించారు. కష్టపడి బాగా పనిచేశారంటూ కొనియాడారు.

పెళ్లి వేడుకలో రాజకీయ ప్రత్యర్థులు

విస్సన్నపేట, జూన్ 3 : రాజకీయాల్లో నువ్వా నేనా అంటూ నిత్య విమర్శలు చేసుకున్న రెండు పార్టీల ప్రత్యర్థులు వివాహ వేడుకకు హాజరయ్యారు. సోమవారం మండల కేంద్రమైన విస్సన్నపేటలో విశ్రాంత ఉపాధ్యాయుడు మేసపాం ఆదాం కుమారుడి వివాహానికి తిరువూరు నియోజకవర్గం కూటమి అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు, వైసీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసులు హాజరయ్యారు. దీంతో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వేదిక వద్దకు చేరుకున్నారు. అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. కూటమి అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు వైసీపీ అభ్యర్థి స్వామిదాసును పలకరించి కరచాలనం చేయడంతో ప్రజలు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇరువురు నూతన వధూవరులను ఆశీర్వదించి అక్కడి నుంచి నిష్క్రమించారు.



విస్సన్నపేటలో వివాహ వేడుకకు హాజరైన కొలికపూడి, నల్లగట్ల



విజేతగా నిలిచిన కృష్ణా టీమ్

సెంట్రల్ జోన్ వన్డే టోర్నీ విజేత కృష్ణా జట్టు

విజయవాడస్పోర్ట్స్, జూన్ 3 : నర్సరావుపేట పేరిచర్ల స్టేడియంలో ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్-19 పురుషుల సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల వన్డే టోర్నీలో కృష్ణా జట్టు విజేతగా నిలిచింది. సోమవారం పశ్చిమగోదావరి జట్టుపై కృష్ణా నాలుగు వికెట్లతో విజయం సాధించింది. తొలుత పశ్చిమ గోదావరి జట్టు 36 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేయగా, కృష్ణా జట్టు 28 ఓవర్లలో ఆరు వికెట్లను నష్టపోయి 162 పరుగులతో జయకేతనం ఎగుర వేసింది. మూడు మ్యాచ్‌ల్లో విజేతగా నిలిచి ఆరుపాయింట్లతో సెంట్రల్ జోన్ చాంపియన్‌షిప్‌ను వశం చేసుకుంది. కృష్ణా జట్టును కేడీసీఏ అడహక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథ్‌రాజు అభినందించారు.

ప్రకాశంపై కృష్ణా ఘన విజయం

విజయవాడ స్పోర్ట్స్ : మూలపాడు ట్విన్ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సెంట్రల్ జోన్ సీనియర్ పురుషుల వన్డే క్రికెట్ టోర్నీలో ప్రకాశంపై కృష్ణా రెండు వికెట్ల తేడాతో నెగ్గింది. సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షం కారణంగా మ్యాచ్‌ను 31 ఓవర్లకు కుదించారు. తొలుత ప్రకాశం 31 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. కె.క్రాంతి కిరణ్ 84 బంతుల్లో 12 ఫోర్లుతో 100 పరుగులు చేయగా, సీహెచ్ క్రాంతికుమార్ 50 బంతుల్లో 6 ఫోర్లు, మూడు సిక్స్‌లతో 69 పరుగులు చేశాడు. కృష్ణా బౌలర్లలో ఎ.బ్రహ్మతేజ 2 వికెట్లను తీశాడు. అనంతరం కృష్ణా జట్టు 31 ఓవర్లలో 8 వికెట్ల కోల్పోయి 233 పరుగులు చేసి విజయం సాధించింది. బ్యాటర్స్ ఎం.నిఖిల్ నాయుడు 95 పరుగులతో రాణించి జట్టును విజయ పథంలో నిలిపాడు.

లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు..

- **నల్లగొండ జిల్లా చిట్యాలలో రోడ్డు ప్రమాదం**
- **ఒకరి మృతి, మరొకరికి గాయాలు**
- **మృతుడు ఏలూరు జిల్లావాసి**



చిట్యాలరూరల్, జూన్ 3 : జాతీయ రహదారిపై వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. చిట్యాల ఎస్‌ఐ-2 లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామానికి చెందిన ఆగు సోమల కుటుంబరావు (42) హైదరాబాద్‌లోని కోమలి ట్రావెల్స్‌లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఈ నెల 2వ తేదీన రాత్రి హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్ నుంచి విజయవాడకు ప్రయాణికులతో వెళ్తున్న కోమలి ట్రావెల్స్ బస్సులో డ్రైవర్ అరిగిల మణికంఠతో పాటుగా బయలుదేరాడు. మార్గమధ్యలో బస్సు అర్ధరాత్రి దాటాక చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి శివారులోకి చేరుకోగానే పెట్రోల్ బంకు నుంచి లారీ వేగంగా రోడ్డు మీదకు వచ్చింది. బస్సు అదుపుతప్పి లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న కుటుంబరావుతో పాటు డ్రైవర్ మణికంఠకు గాయాలయ్యాయి. బస్సులోనే ఉన్న మరో డ్రైవర్ నాగేంద్రవరప్రసాద్ ఇద్దరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కుటుంబరావు మృతి చెందాడు. కుటుంబరావు భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ లింగయ్య పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.50

ప్రజాస్వామ్యంలో దాడులు అమానుషం..

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 3 : ప్రజలకు సేవలందించేందుకు ప్రతినిధిని ఎన్నుకునే ఎన్నికల్లో విపక్షాలపై భౌతికదాడులు చేయడం అమానుషమని లయన్స్ మాజీ అధ్యక్షుడు యలమంచిలి రవికుమార్ అన్నారు. రంగన్నగూడెంలోని ఆళ్ల నివాసంలో ఆయన్ను సోమవారం కలిసి పరామర్శించారు. దాడి జరిగిన తీరు తదితర విషయాలతో పాటు ఆళ్ల ఆరోగ్యంపై లయన్స్ క్లబ్ సభ్యులు ఆరా తీశారు. వివాదరహితుడిగా పలు సంఘాల ద్వారా సేవలందించే ఆళ్ల గోపాలకృష్ణపై దాడిని వారు ఖండించారు. లయన్స్ క్లబ్ సభ్యుడైన ఆళ్ల గోపాలకృష్ణకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో చలసాని వెంకటేశ్వరరావు, అట్లూరి దిలీప్‌కుమార్, అక్కినేని రాఘవేంద్రరావు, నందిగం స్వామి, గూడపాటి రత్నశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతతకు సహకరించాలి

- అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



గన్నవరంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

గన్నవరం, జూన్ 3 : గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి కోరారు. గన్నవరం పోలీస్ స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంగళవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయడానికి జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా భద్రతను ముమ్మరం చేశామన్నారు. సెక్షన్ 144, యాక్ట్ 30 అమల్లో ఉన్నందున ఎంతో రాజకీయ చైతన్యం కలిగిన గన్నవరం ప్రజలు ఎన్ని కలు పూర్తయిన తరువాత కూడా అల్లర్లు జరగకుండా పోలీసు లకు సహకరించాలని కోరారు. అల్లర్లు, గొడవలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలకు వెనకాడేది లేదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం వాటిల్లేలా ఏ ఒక్కరూ ప్రవర్తించరాదని, విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ప్రజల దృష్టికి ఏదైన గొడవలు జరిగే విషయం తెలిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. డీఎస్పీలు జయసూర్య, శ్రీవేద, సీఐ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలి

పెనమలూరు : కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని, శాంతిభద్రతలను కాపాడడానికి పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి కోరారు. సోమవారం పెనమలూరు పోలీసు స్టేషన్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల నియమావళి అమల్లో ఉందని, 144సెక్షన్, 30 పోలీసు యాక్టులు అమల్లో ఉన్నాయన్న విషయం గుర్తుంచుకోవాలని కోరారు. నలుగురు కంటే ఎక్కువ సంఖ్యలో గుమికూడడం కూడదని, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం, వేరే పార్టీల వారిపై గొడవలకు దిగడం, రెచ్చగొట్టడం లాంటివి చేయకూడదని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఫైరింగ్‌కు కూడా వెనుకాడబోమని తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తారన్న అనుమానం ఉన్నవారిని ముందస్తు అరెస్టులు చేస్తామని, కౌంటింగ్ కేంద్రాలకు అనుమతి ఉన్న వ్యక్తులు తప్ప వేరెవ్వరూ వెళ్లకూడదని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఇలాంటి వ్యక్తులు తారసపడినట్లయితే స్థానికేతరునిగా గుర్తించి అరెస్టు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తారని అనుమానం ఉన్న ప్రతి ఒక్కరినీ ముందస్తుగా అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐలు టీవీవీ రామారావు, శ్రీనివాసరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

● నేటి ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా నియోజకవర్గానికి వచ్చిన పోలీసు బలగాలతో పెనమలూరు నిండిపోయింది. కౌంటింగ్ సందర్భంగా నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా సాయుధ బలగాలు నియోజకవర్గానికి చేరుకున్నాయి. ఎన్నికల నియమావళిని ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలుంటాయని పోలీసులు హెచ్చరించారు. ఇన్‌చార్జి డీఎస్పీ సుభాష్ ఎన్నికల రోజున అల్లరి మూకలపై ప్రయోగించేందుకు గ్యాస్‌గన్ తదితర అంశాలను అధికారులకు, సిబ్బందికి వివరించారు.



గ్యాస్‌గన్ పని విధానాన్ని వివరిస్తున్న డీఎస్పీ సుభాష్

అల్లర్లకు పాల్పడితే రౌడీషీటే..

కంకిపాడు : సార్వత్రిక ఎన్నికల లెక్కింపులో అల్లర్లకు పాల్పడితే రౌడీషీట్ తెరుస్తామని కంకిపాడు ఎస్సై డి. సందీప్ అన్నారు. కంకిపాడు సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండల కేంద్రమైన కంకిపాడుతో పాటు ఉప్పలూరు, గొడవర్రు, మంతెన గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్థానికుల నుంచి కూడా పోలీసులకు అవసరమైన సహకారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచటం జరుగుతుందని తెలియజేశారు.

ఉయ్యూరులో పటిష్ట బందోబస్తు

ఉయ్యూరు : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా పట్టణంలో ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా అన్నారు. స్టేషన్ ఆవరణలో సోమవారం పోలీసు సిబ్బందికి ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బందోబస్తుపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లర్లు, అలజడులకు పాల్పడే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సై గణేశ్‌కుమార్ పాల్గొన్నారు.



ఉయ్యూరులో సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ హబీబ్‌బాషా

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారి సాల్మన్‌రాజు

ఆకునూరు(ఉయ్యూరు), జూన్ 3 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని జిల్లా వృత్తి వి ద్యాశాఖ అధికారి పీబీ సాల్మన్‌రాజు అన్నారు. ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఉయ్యూరు, కంకిపాడు మండలాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోధ్యాయులతో సమావేశం నిర్వహించి జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయా లన్నారు. ఆర్ఐఓ రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ విజయశ్రీ, ఆకునూరు, తాడంకి, కలవపాముల, పెదఓగిరాల, కాటూరు, కంకిపాడు, నెప్పల్లి, ముదునూరు, ఉయ్యూరు, పునాదిపాడు జడ్పీహె చ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ

హనుమాన్‌జంక్షన్, జూన్ 3 : స్థానిక విజయవాడ రోడ్డులోని మూలకొట్టు సెంటర్‌లో శ్రీవెంకటలక్ష్మి జనరల్ స్టోర్స్‌లో సోమవారం తెల్లవారు జామున గుర్తుతెలియని దుండగులు తాళాలు పగులకొట్టి చొరబడ్డారు. దుకాణంలో రూ.40వేలు విలువ చేసే సిగరెట్లు, కొన్ని నిత్యావసర సరుకులు, రూ.60వేలు నగదు దోచుకుపోయారు. దుకాణం ముందు భాగంలో తలుపుల తాళాలు పగులకొట్టి లోనికి ప్రవేశించినట్లు తెలుస్తోంది. తాళాలు పగుల కొట్టడానికి వినియోగించిన సుత్తి, సానం, కటింగ్ ప్లైయిర్‌ను దొంగలు అక్కడే వదిలిపెట్టారు. ఈ మేరకు దుకాణం యాజమాని మాటూరి పార్థసారథి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 3వ తేదీన దుకాణం వెనుక వైపు తలుపులు పగులకొట్టి దాదాపు రూ.2లక్షలు విలువ చేసే నిత్యావసర సరుకులు, సిగరెట్లు అపహ రించారు. నెల రోజుల్లో రెండు సార్లు ఒకే దుకాణం లో దొంగలు చొరబడి లక్షలాది రూపాయలు విలువ చేసే సరుకులు అపహరించారు.

12నుంచి ఆర్టీసీ బస్‌పాస్‌లు

ఉయ్యూరు, జూన్ 3 : ఉయ్యూరు బస్‌డిపో పరిధిలో బస్‌పాస్ కౌంటర్లలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ జరుగుతుందని డిపో మేనేజర్ కెఎస్ఆర్‌కె ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు బస్‌పాస్‌లు ఇచ్చేందుకు ఆలస్యమవుతుందని, ఈ నెల 6, 7 తేదీల్లో కాకుండా 12వ తేదీన ఉయ్యూరు, కంకిపాడు బస్‌పాస్ కౌంటర్లలో కొత్తపాస్‌ల జారీ ప్రారంభిస్తామని తెలిపారు.

ఇజ్రాయిల్ నరమేధాన్ని ఆపాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మచిలీపట్నం టౌన్, జూన్ 3 : పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధాన్ని ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. సీపీఎం కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నరసింహారావు మాట్లాడారు. పాలస్తీనా కాల్పుల విరమణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అబ్దుల్ మతీన్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, మచిలీపట్నం ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడు బాషా, అజీజ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేష్, సీపీఎం నాయకులు సుబ్రహ్మణ్యం, కొడాలి శర్మ, ఎస్. ధనుంజయరావు, మాదాల వెంకటేశ్వరరావు, ఎం.పోలినాయుడు, కె.వి. గోపాలరావు, సిహెచ్. జయరావు, ఏఐటీయూసీ నాయకులు ఓ.ఎల్. రావు, రత్నకుమారి మాట్లాడారు. రఫా పట్టణంపై నరమేధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

టీడీపీ విజయం సాధించాలని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్, జూన్ 3 : సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంగళవారం జరగనున్న కౌంటింగ్‌లో టీడీపీ విజయం సాధించాలని కోరుతూ, సోమవారం ఆ పార్టీకి చెందిన బాపులపాడు మండల నేతలు స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మచిలీపట్నంలో జరగనున్న కౌంటింగ్ ఏజెంట్లుగా పాల్గొనే టీడీపీ నాయకులు చిరుమామిళ్ల సూర్యం, ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావర ప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు, కలపాల సూర్యనారాయణ తదితరులు మచిలీపట్నం వెళుతూ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రామాచార్యులు స్వామి ఆశీస్సులు అందజేశారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావాలని, సీఎంగా చంద్రబాబు అధికారం చేపట్టాలని, గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యేగా యార్లగడ్డ వెంకట్రావు విజయం సాధించే విధంగా ఆశీస్సులు అందించాలని కోరుతూ పూజలు నిర్వహించారు. ఈ పూజలో పార్టీ నాయకులు అమృతపల్లి సూర్యనారాయణ, మందాడి రవీంద్ర పాల్గొన్నారు.



కాటూరు రోడ్డులో పేరుకుపోయిన చెత్త

గండిగుంటలో పారిశుధ్యం అధ్వానం

● పేరుకుపోతున్న చెత్త ● పట్టించుకోని గ్రామపంచాయతీ

గండిగుంట(ఉయ్యూరు), జూన్ 3 : గండిగుంట గ్రామపంచాయతీ పరిధి లో పేరుకుపోతున్న చెత్తకుప్పలు, కదలని డ్రెయిన్లతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. గ్రామంలో అంతర్గత రోడ్లతోపాటు కాటూరు రోడ్డులో జాతీయ రహదారి వద్దనుంచి కాకానినగర్ వరకు ఆర్ అండ్‌బీ రోడ్డుపక్కన చెత్తకుప్పలు తొలగించకపోవడంతో గాలికి లేచి రోడ్డుపై వెళ్లేవారిపై పడుతున్నాయి.. పేరుకుపోయిన చెత్తకుప్పల్లో వ్యర్థాల కోసం ఎలుకలు, పందికొక్కులు కన్నాలు పెట్టి రోడ్డును తొలచి వేయడంతో కుంగి వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల శ్రీవిశ్వశాంతి స్కూల్ సమీపాన ఇసుక టిప్పర్ బోల్తా పడగా పెద్ద ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు పారిశుధ్యంపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువు తవ్వకం నిలిపివేత

గుడివాడ రూరల్, జూన్ 3 : మోటూరులో అనుమతులు లేకుండా చెరువు తవ్వడాన్ని నిలిపివేసినట్లు వీఆర్వో రాంబాబు సోమవారం తెలిపారు. మోటూరుకు చెందిన రైతు ఆరు ఎకరాల చెరువును యంత్రాలతో తవ్వుతున్నట్లు సమాచారం అందడంతో అడ్డుకుని ఐదు ఎక్స్‌కవేటర్లు సీజ్ చేశామన్నారు.

ఇంటర్ తరగతులు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 3 : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు జూనియర్ కాలేజీల ద్వారా ఉచితంగా ఉన్నత చదువులు అందుబాటులోకి వచ్చాయని, సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సురేష్‌కుమార్ సూచిం చారు. వీరవల్లి హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన జూనియర్ కాలేజీలో ఇంటర్ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. వీరవల్లిలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయడం వల్ల చుట్టుప్రక్కల గల 15 గ్రామాల్లోని విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పేరెంట్స్ కమిటీ కో-ఆప్షన్ సభ్యుడు చిలకపాటి పద్మనాభం తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజీ ఇన్‌చార్జి ఆళ్ల కృష్ణారావు, హెచ్‌ఎం నిర్మల, అలుగుల దేవానంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇంటర్ విద్యార్థులతో అధ్యాపకులు

విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం

ఉంగుటూరు, జూన్ 3 : పెద్దలు, పిల్లల విరామకాల సద్వినియోగానికి, విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయని, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచడంతోపాటు, ఆలోచనా దృక్పథాన్ని మెరుగుప రచడంలో గ్రంథాలయాల పాత్ర ఎనలేనిదని, ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం ఒక గంటసేపయినా గ్రంథాలయాలకు వచ్చి వివిధ రకాల పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవడంద్వారా ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చని ఆత్కూరు, మానికొండ, ఉంగుటూరు, తేలప్రోలు గ్రంథాలయాధికారులు బీవీ కృష్ణారావు, ఎల్,హరికృష్ణ, యు,చంద్రశేఖరరావు, బి.శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా సోమవారం మండలంలోని నాలుగు గ్రంథాలయాల్లో విద్యార్థులకు పుస్తకపఠనం, కథలు చెప్పించడం, డ్రాయింగ్, న్యూస్‌పేపర్ చదివించడం, భారతదేశంమ్యాప్‌పై అవగాహన కలిగించడం తోపాటు, క్యారమ్స్, చదరంగం, స్నేక్ అండ్ లీడర్ వంటి ఆటలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయసిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

గన్నవరం : మండలంలోని గన్నవరం గ్రేడ్-1, ముస్తాబాద గ్రేడ్-3 గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. సోమవారం విద్యార్థులకు నీతి కథలు చదివించటం, మ్యూజికల్ ఛైర్స్, క్యారమ్స్ ఆటలు ఆడించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు రావటం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మంచి భవిష్యత్ ఉంటుంద న్నారు. గ్రంథాలయాల ఇన్‌చార్జులు బాబూరావు, కె.జ్యోతికుమారి పాల్గొన్నారు.



ముస్తాబాద గ్రంథాలయంలో నీతి కథలు చదువుతున్న విద్యార్థులు

అలజడి సృష్టించేందుకు వైసీపీ పన్నాగం: దేవినేని రాజా

కంకిపాడు, జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతో వైసీపీ నాయకులు అలజడి సృష్టించేందుకు కుటిల పన్నాగాలు పన్నుతున్నారని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓటమి భయంతో వైసీపీ నాయ కులు కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కౌంటిగ్ కేంద్రాల్లో కుర్చు నేందుకు కూడా ఏజెంట్లు ఉండరన్న భయంతోనే వైసీపీ నాయకులు తమకు 150 సీట్లుపైనే వస్తాయన్న గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లర్లు సృష్టించి ఓట్లు లెక్కింపును అడ్డుకునేందుకు వైసీపీ ప్రయత్నిస్తుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాల న్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, షేక్ షకార్, సుధాకర్ పాల్గొన్నారు.

కృష్ణా

• మచిలీపట్నం • పెడన • గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.50



అగ్నిపూల కనువిందు

నిన్నటి వరకు ఎండ ప్రచండం, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు రుతుపవనాల రాకను సూచిస్తూ చిరుజల్లులు కురుస్తుండడంతో గుడ్లవల్లేరులో రహదారి వెంబడి అగ్నిపూలు (తురాయి) కనువిందు చేస్తున్నాయి.

\- గుడ్లవల్లేరు



మచిలీపట్నం టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్రకు ఆశీర్వచనాలు అందజేస్తున్న వేదపండితులు

పేద బ్రాహ్మణులకు అండగా ఉంటాం

• కొల్లు రవీంద్రకు వేదపండితుల ఆశీర్వచనం

మచిలీపట్నం టౌన్ : కూటమి అధికారంలోకి రాగానే పేద బ్రాహ్మణులకు అండగా ఉంటామని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. కొల్లు రవీంద్రను సోమవారం వేదపండితులు ఆశీర్వదించారు. రవీంద్ర మాట్లాడుతూ, కూటమి అధికారంలోకి రాగానే బ్రాహ్మణ కార్పొరేషన్, బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీని బలోపేతం చేస్తామన్నారు. వేద విద్యను అభ్యసించిన నిరుద్యోగులకు యువగళం కింద రూ. 3 వేల నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. హిందూ దేవాలయాలు, సత్రాల ఆస్తుల పరిరక్షణకు హిందూ ఎండోమెంట్ బోర్డును ఏర్పాటు చేస్తామన్నారు. ప్రైవేటు దేవాలయాల్లో పని చేసే అర్చకులకు కనీస వేతనం ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్లబుల్లయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర అధికార ప్రతినిధి, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ పి.వి. ఫణికుమార్, టీడీపీ నాయకులు కొల్లు పునీత్, మరకాని పరబ్రహ్మం, కాసాని భాగ్యారావు పాల్గొన్నారు.



అర్తమూరులో లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్

కూటమి గెలుపు కోసం లక్ష్మీగణపతి హోమం

బంటుమిల్లి, జూన్ 3 : కూటమి విజయం సాధించాలని, జనసేన ఎంపీ అభ్యర్థి బాలశౌరి, పెడన టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ అత్యధిక మెజార్టీతో గెలవాలని కాంక్షిస్తూ అర్తమూరులో సోమవారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. గ్రామానికి చెందిన చిట్టాజానకీ రామయ్య దంపతులు నిర్వహించిన గణపతి హోమంలో ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. కూనపరెడ్డి వీరబాబు, బొర్రా కాశీ, యార్లగడ్డ శ్రీనవాసరావు, ఇజ్రాయిల్, భూపతి రమేష్, కాగిత రవికుమార్, చలపాటి శ్రీనివాసరావు, మోతుకూరి సీతారామయ్య, కాగిత జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



తామరాకులతో నిండి బురదమయంగా ఉన్న చెన్నూరు తాగునీటి చెరువు

చెన్నూరులో తాగునీటి ఇబ్బందులు

పెడన రూరల్ : మేజరు పంచాయతీ అయిన చెన్నూరులో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు వేలకు పైగా జనాభా గల ఈ గ్రామంలో తాగునీటి చెరువు పక్కనే ఆర్వో ప్లాంట్ నిర్మించి ప్రజలకు తాగునీరందిస్తున్నారు. చెరువులో తామరాకులు, తూడు పెరిగి పోవటంతో అవి కుళ్లి నీరు దుర్వాసన వస్తోందని ప్రజలు తెలిపారు. ఇటీవల చెరువులో మురుగు తొలగించకుండా నీరు నింపడంతో మొత్తం నీరంతా కలుషితమైంది. తాగునీరు ఫిల్టర్ చేసే విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శించారు. చెరువులో తూడు తొలగించి బ్లీచింగ్ చల్లించాలని, వాటర్ ట్యాంకర్ శుభ్రం చేయించి సురక్షిత నీటిని నీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యోగాశక్తితో వ్యాధులు దూరం



బంటుమిల్లిలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ మాకాల సత్యనారాయణ

బంటుమిల్లి : మందులు, ఆపరేషన్, సైడ్ఎఫెక్ట్స్ లేకుండా మూల సమస్యలు పరిష్కరించేందుకు యోగా శక్తి చికిత్సా విధానాన్ని ప్రారంభించినట్లు యోగశక్తి సాధనా సమితి అధినేత మాకాల సత్యనారాయణ అన్నారు. గుండా బత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో ఆక్యూప్రెజర్ వైద్య సేవలు అందించారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల ప్రజలు వైద్య సేవలు పొందారు గుండెపోటు, కేన్సర్, పక్షవాతం, ఊపిరితిత్తుల సమస్యలు పెరిగిపోయిన తరుణంలో యోగశక్తి సాధనా సమితి ద్వారా ప్రజలలో గణనీయమైన మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బంటుమిల్లిలో సాయిపాదుకలకు పూజలు



బంటుమిల్లి, జూన్ 3 : భక్తుల దర్శనార్థం షిరిడి సాయిబాబా పాదుకలు బంటుమిల్లి సాయిబాబా ఆలయంలో ఉంచారు. షిరిడి సేవా సమితి ఆధ్వర్యంలో బాబా పాదుకలు గ్రామగ్రామాన సాయి ఆలయాల్లో ఏర్పాటు చేశారు. సోమవారం బంటుమిల్లి, పెందుర్రు, జానకిరామపురం, పాంద్రాక, తదితర గ్రామాల్లో భక్తులు సాయి పాదుకలను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

ఇజ్రాయిల్ నరమేధాన్ని ఆపాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహారావు

మచిలీపట్నం టౌన్ : పాలస్తీనాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధాన్ని ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. సీపీఎం కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నరసింహారావు మాట్లాడారు. పాలస్తీనా కాల్పుల విరమణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అబ్దుల్ మతీన్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, మచిలీపట్నం ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడు బాషా, కార్యదర్శి అజీజ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్. రాజేష్, సీపీఎం నాయకులు సుబ్రహ్మణ్యం, కొడాలి శర్మ, ఎస్. ధనుంజయరావు, మాదాల వెంకటేశ్వరరావు, ఎం.పోలినాయుడు, కె.వి.గోపాలరావు, సిహెచ్. జయరావు, ఏఐటీయూసీ నాయకులు ఓ.ఎల్. రావు, రత్నకుమారి తదితరులు మాట్లాడారు. రఫా పట్టణంపై అమానుష నరమేధాన్ని ఆపాలని, పాలస్తీనాలో వెంటనే కాల్పుల విరమణ చేపట్టాలని కోరారు.



పామర్రులో శాంతిభద్రతలపై సూచనలు చేస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ



చల్లపల్లిలో డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో పోలీసు కవాతు



కోడూరు స్టేషన్లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఎస్సై శిరీష, సిబ్బంది

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

• ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ

పామర్రు, జూన్ 3 : ఓట్ల కౌంటింగ్, ఫలితాల అనంతరం రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సంయమనంతో వ్యవహరించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి కోరారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో సోమవారం పామర్రులో ఆయన పర్యటించి పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలో కలియ తిరిగి శాంతి భద్రతలకు విఘాతం వల్ల జరిగే అనర్థాలపై ప్రజల్ని చైతన్య వంతుల్ని చేశారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. నియోజకవర్గాల్లోని గ్రామాల్లో 144, సెక్షన్ 30 పోలీస్ యాక్టు అమల్లో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలు, బాణసంచాకాల్చడం నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఊహాజనిత సమాచారాన్ని నమ్మవద్దన్నారు. సోషల్ మిడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు, పోస్టులు పెట్టి గొడవలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఘర్షణలకు దిగే వారిపై రౌడీ షీట్లు తెరవడం ఖాయమని హెచ్చరించారు. డీఎస్పీలు పి.శ్రీకాంత్, నోడల్ డీఎస్పీ నాగరాజు, సీఐ శుభాకర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రెచ్చగొడితే చర్యలు : డీఎస్పీ

చల్లపల్లి, జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే సమయంలో ఎవరూ రెచ్చగొట్టే చర్యలకు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం పోలీసుశాఖ ఆధ్వర్యంలో చల్లపల్లి పురవీధుల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచీ ప్రధాన సెంటర్ మీదుగా బస్టాండ్ సెంటరు వరకు ఫ్లాగ్‌మార్చ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ, 144 సెక్షన్, 30 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో గుంపులుగా తిరగరాదనీ, వివాదాలకు తావిచ్చేలా వ్యవహరించరాదని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చల్లపల్లి సీఐ సిహెచ్. నాగప్రసాద్, ఎస్ఐలు సిహెచ్.చినబాబు, కె.ప్రతాపరెడ్డి, వైవి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఉదయం చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఎస్సై చినబాబు ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. రోడ్డుపై ముళ్ల కంచె వేసి గొడవల సమయంలో చేపట్టే చర్యల గురించి వివరించారు. **పమిడిముక్కల** : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాలలో బందోబస్తుపై పోలీసు సిబ్బందికి ఎస్సై కె.శ్రీనివాస్ సూచనలిచ్చారు. స్టేషన్ ఆవరణలో సోమవారం ఓట్ల లెక్కింపు అనంతరం ఏవిధమైన అలజడి, అల్లర్లు, ర్యాలీలు చేపట్టకుండా గట్టి బందోబస్తు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణం ఉండేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. మంటాడలో యువకులతో సమావేశమై శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అల్లర్లు సృష్టిస్తే ఖబడ్దార్

కోడూరు, జూన్ 3 : కౌంటింగ్ నేపథ్యంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కోడూరు ఎస్సై పి.శిరీష హెచ్చరించారు. సోమవారం కోడూరు పోలీస్ స్టేషన్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాల్లో భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. ఎవరైనా సరే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, అనుమతి లేకుండా ఎటువంటి ర్యాలీలు నిర్వహించినా కేసులు నమోదు చేస్తామన్నారు. కౌంటింగ్ రోజు కూడా ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బందోబస్తుపై సిబ్బందికి సూచనలు

అమల్లో పోలీస్ యాక్ట్



గుడ్లవల్లేరు : కౌంటింగ్ నేపథ్యంలో గుడ్లవల్లేరు మండలంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని మండల ప్రజలు, అన్ని రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు గమనించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ ఎస్సై జి.సత్యనారాయణ కోరారు. నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం చేయరాదన్నారు. కౌంటింగ్ సమయంలో కానీ, అనంతరం కానీ ఎటువంటి డీజేలు, విజయోత్సవాలు, బాణాసంచా కాల్చడం చేయరాదని ఆయన సూచించారు. **పెడన :** మండల పరిధిలో 144 సెక్షన్, పోలీసు యాక్టు అమలులో ఉన్నందున ఓట్ల లెక్కింపు సందర్భంగా ర్యాలీలు, విజయోత్సవాలు నిషేధించామని ఎస్సై సూర్య శ్రీనివాస్ పేర్కొన్నారు. అల్లర్లకు దిగినా, శాంతి భద్రతలకు భంగం కలిగించినా కఠిన దండన తప్పదని ఆయన హెచ్చరించారు.



కౌంటింగ్ ఏజెంట్లతో కూటమి అభ్యర్థి బుద్ధప్రసాద్



కౌంటింగ్ ఏజెంట్లతో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి రవీంద్ర

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

అవనిగడ్డ, జూన్ 3 : జనసేన కౌంటింగ్ ఏజెంట్లు నిశిత పరిశీలనతో వ్యవహరించాలని అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ కోరారు. అవనిగడ్డలో బుద్ధప్రసాద్ ఇంటి వద్ద కూటమి కౌంటింగ్ ఏజెంట్లకు సోమవారం శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో సంయమనంతో వ్యవహరించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు మొదలుకుని చివరి రౌండ్ వరకూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మచిలీపట్నం టౌన్ : కౌంటింగ్ ఏజెంట్ల అప్రమత్తంగా ఉండి, ఏ సమస్య వచ్చినా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర సూచించారు. సోమవారం మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ నిర్వహించారు. కౌంటింగ్ ఏజెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను టీడీపీ నాయకులు యశ్వంత్‌వర్మ వివరించారు. కౌంటింగ్ ప్రక్రియ చివరి వరకు ఉండాలన్నారు. ఏ రౌండ్‌కా రౌండ్ పోలైన ఓట్లను నమోదు చేసుకోవాలన్నారు. రవీంద్ర మాట్లాడుతూ, సంయమనం పాటిస్తూ ఏ సమస్య వచ్చినా అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలన్నారు. టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబాప్రసాద్, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నాని, గుమ్మడి విద్యాసాగర్, కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, దింటకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా జరిగేలా చూడండి

మచిలీపట్నం టౌన్ : కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ అన్నారు. సోమవారం జనసేన మచిలీపట్నం కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియ ఎలా చేపట్టాలో కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇచ్చారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, కౌంటింగ్ ప్రక్రియకు అధికారులకు సహకరించాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సున్నితంగా పరిష్కరించుకోవాలన్నారు.



ఫాదర్ జాన్ హరీష్‌ను సత్కరిస్తున్న మైఖేల్ తదితరులు



ఫాదర్ జోసెఫ్‌ని సన్మానిస్తున్న విశ్వాసులు

ఫాదర్ జాన్ హరీష్, జోసెఫ్‌కు సత్కారం

గుడివాడ : ఏలూరురోడ్డులోని మౌంట్ కార్మెల్(ఆర్‌సీఎం) చర్చిలో ఏడాది కాలంగా సహాయ గురువుగా పనిచేసిన జాన్‌హరీష్‌కు సోమవారం చర్చి కౌన్సిల్ సభ్యులు, యూత్ సభ్యులు, మరియదళం, విన్సెంట్ ది పాల్ సొసైటీ సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. చర్చి ఫాదర్ గుజ్జుల మైఖేల్ మాట్లాడుతూ బ్రదర్‌గా 14 సంవత్సరాలు దైవ వాక్కు తర్ఫీదు పొంది మరో ఐదేళ్ల వివిధ ప్రాంతాల్లోని చర్చిల్లో సహాయగురువుగా బాధ్యతలు చేపట్టడం దేవుని వరమన్నారు. ప్రతి విచారణలో బదిలీ సర్వసాధారణమన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఉపదేశకులు, సిస్టర్స్ పాల్గొన్నారు. **చల్లపల్లి :** సాలిపేట ఆర్సీఎం చర్చి రెవరెండ్ ఫాదర్ ఎం.జోసఫ్ బదిలీపై కంకిపాడు మండలం వేల్పూరు ఆర్సీఎం చర్చికి వెళుతున్న సందర్భంగా విశ్వాసులు ఘనంగా సన్మానించారు. చర్చి సంఘ పెద్దలు బడుగు సంజీవరావు, వి.నాగరాజు, తోట ఫిలోనమ్మ, కాకుమాని రాజేష్ తదితరులు ఫాదర్ జోసఫ్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. తొలుత ఫాదర్ ప్రత్యేక ప్రార్థనలు చేసి శాంతి సందేశాలను వివరించారు. గుణదల నుంచి ఫాదర్ బిరుదుగడ్డ రవికుమార్ సాలిపేట ఆర్సీఎం చర్చి ఫాదర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

మోటూరులో చెరువు తవ్వకం నిలిపివేత

గుడివాడ రూరల్, జూన్ 3 : మోటూరులో అనుమతులు లేకుండా చెరువు తవ్వడాన్ని నిలిపివేసినట్లు వీఆర్వో రాంబాబు సోమవారం తెలిపారు. మోటూరుకు చెందిన రైతు ఆరు ఎకరాల చెరువును యంత్రాలతో తవ్వుతున్నట్లు సమాచారం అందడంతో అడ్డుకుని ఐదు ఎక్స్‌కవేటర్లు సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.

బుద్ధప్రసాద్ పరామర్శ

మోపిదేవి : ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాసరావును మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సోమవారం పరామర్శించారు. కొండపల్లి శ్రీనివాసరావు తండ్రి ప్రసాదరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బుద్ధప్రసాద్ శ్రీనివాసరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, రాఘవేంద్రరావు తదితరులు ఉన్నారు.

బస్‌పాస్‌ల జారీ 12 నుంచి

పమిడిముక్కల, జూన్ 3 : ఉయ్యూరు బస్‌డిపోలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కారణంగా బస్‌పాస్‌ల జారీకి ఆలస్యమవుతోందని ఈనెల 6, 7 తేదీల్లో కాకుండా 12వ తేదీన ఉయ్యూరు, కంకిపాడ్ బస్‌పాస్ కౌంటర్లలో కొత్తపాస్‌ల జారీ ప్రారంభిస్తామని డిపో మేనేజర్ కెఎస్ఆర్‌కె ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అక్రమంగా మట్టి రవాణా చేస్తే తగిన చర్యలు

నాగాయలంక : అధికారుల అనుమతులు లేకుండా మట్టి, ఇసుకను అక్రమ రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.సుబ్బారావు హెచ్చరించారు. అనుమతులు లేకుండా రాత్రిపూట మట్టి, ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని ఇటీవల మీడియాలో పలు కథనాలు వచ్చాయి. స్పందించిన తహసీల్దార్ ఆదివారం అర్ధరాత్రి తన సిబ్బందితో కలసి చోడవరం, తలగడదీవి, టి.కొత్తపాలెం గ్రామాలలో పర్యటించారు. సిబ్బంది రాత్రి వేళ కాపలా కాయాలని ఆదేశించారు.